ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.68)	316	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.88 (0.41)	479	1394

చికెన్ ధరలు | లైవ్ :రూ.160 | డ్రెస్ :రూ.230 | స్కిన్‌లెస్ : రూ.250

ఏళ్ల తరబడి చదువులు. నెలల కొద్దీ కోచింగ్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే తిప్పలు తప్పనున్నాయి. ఇక ఐటీఐల స్థానంలో ఏటీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశం రానుంది. మొత్తం ఆరు కోర్సులను కొత్తగా ప్రవేశపెడుతుండడంతో ఈ కోర్సులపై ఇప్పటికే అధ్యాపకులకు శిక్షణ సైతం పూర్తయింది. ఈ కోర్సులతో ఏడాదికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4వేల మంది లబ్ధి పొందనున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



తక్షణ ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- ప్రతి ఏటీసీలో ఆరు కోర్సులు
- ఉమ్మడి జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీల ఏర్పాటు
- ఏటీసీగా మార్చేందుకు ఒక్కోదానికి రూ.34 కోట్ల వ్యయం
- ఈ ఏడాది నుంచే కొత్తకోర్సుల నిర్వహణ
- విదేశాల్లోనూ ఉద్యోగావకాశాలకు ఛాన్స్

విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాలు నేరుగా లభించేందుకు అనుగుణంగా ఐటీఐలను ఆధునికీకరించే ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు (ఐటీఐ)గా కొనసాగుతున్న వాటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చబోతోంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో కలిసి ఈ సెంటర్లను ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. దీర్ఘ, స్వల్ప కాలిక కోర్సులను ఈ కేంద్రాల్లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీలు ఏర్పాటవుతున్నాయి. ఒక్కో ఏటీసీలో ఆరు రకాల ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక టీటీఎల్ సహా అరబ్ దేశాలు, దేశీయ ఐటీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీల్లో తక్షణం ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కూడా ఏటీసీలే బాధ్యత తీసుకుంటాయని ప్రభుత్వం పేర్కొంటుండడం ఏటీసీలకు ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘ కాలిక కోర్సుల ద్వారా ప్రతీ సంవత్సరం 5,860 మంది, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 31,200 మందికి ఈ ఏటీసీల్లో శిక్షణ అందితే, ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ఏటా 854 మందికి, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 3,360 మంది విద్యార్థులకు శిక్షణ అందుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.34కోట్ల వ్యయంతో..

ఏటీసీగా మారుస్తున్న ప్రతీ ఐటీఐకి ప్రస్తుతం ప్రవేశపెడుతున్న కోర్సులకనుగుణంగా అవసరమైన ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలతోపాటు, శిక్షణకు అవసరమైన వర్క్‌షాపులు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,324.21 కోట్లు ఖర్చుచేస్తుండగా, ఇందులో టీటీఎల్ సంస్థ 86.74శాతం భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం 13.26శాతం భరిస్తోంది. ఒక్కో ఏటీసీకి సగటున రూ.34కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రాబోయే పదేళ్లవరకు ఈ ప్రాజెక్టు అమల్లో ఉండనుంది. వీటిద్వారా వచ్చే పదేళ్లలో నాలుగు లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ కల్పన నిమిత్తం శిక్షణ అందిస్తామని ఈసంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

ఈ సంవత్సరం నుంచే కొత్త కోర్సులు

ఉమ్మడి జిల్లాలోని ఏడు ఏటీసీలలో ఈ సంవత్సరం నుంచే కొత్తకోర్సులు ప్రారంభించనున్నట్లు ఆయా ఏటీసీల ప్రిన్సిపాళ్లు పేర్కొంటున్నారు. ఇంకా పూర్తిస్థాయి విధి, విధానాలు రాలేదని, ప్రాథమిక కసరత్తు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు జరిగాయని, వర్క్‌షాపులు, క్లాసుల నిర్వహణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కోర్సులకు కేటాయించిన సీట్ల మేరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, ఐటీఐలలో సీట్ల కేటాయింపుల మాదిరిగానే ఏటీసీల్లోనూ నిబంధనలు పాటిస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఉపయుక్తమైన శిక్షణ



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలన్నింటినీ ఏటీసీలుగా మార్చడం అభినందనీయం. ఈ కోర్సుల శిక్షణ ద్వారా ఆధునిక ప్రపంచంలో తక్షణం ఉపాధి, ఉద్యోగం పొందేందు కు విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఇక్కడున్న ఏడు ఏటీసీలలో కొత్త కోర్సుల ఏర్పాటుకు కార్యాచరణ మొదలయింది. ఈ విద్యాసంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభమవుతాయి. ఇంటర్‌స్థాయిలోనే విద్యార్థులు తక్షణం ఉద్యోగం, ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు దోహదపడతాయి. విదేశాల్లోనూ ఈ కోర్సులద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగానే లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- గోపాల్‌రెడ్డి,ఉమ్మడి జిల్లా కన్వీనర్

జిల్లాలో ఏటీసీలలో అందుబాటులో ఉన్న కోర్సులు	కాల వ్యవధి	సీట్ల సంఖ్య
1. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	రెండేళ్లు	24
2. ఆర్టిఫిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	10
3. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)	రెండేళ్లు	24
4. రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	20
5. మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్	రెండేళ్లు	24
6. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	20

ఉమ్మడి జిల్లాలో ఏటీసీలుగా మారనున్న ప్రభుత్వ ఐటీఐలివే..

1. ప్రభుత్వ బాలుర పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
2. ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
3. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	అనుముల
4. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	డిండి
5. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	భువనగిరి
6. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	ఆలేరు
7. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	హుజూర్‌నగర్

ప్రతీ ఏటీసీలో ఆరు దీర్ఘకాలిక కోర్సులు

ఈ ఏటీసీలలో ఆరు దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో మూడు కోర్సులు ఏడాది కాలవ్యవధి ఉంటే, మరో మూడు కోర్సులు రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తవుతాయి. ప్రతీ ఏటీసీలో ఈ ఆరు కోర్సులను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు కోర్సుల్లో కలిసి 122మంది విద్యార్థులకు ఒక్కో ఏడాది శిక్షణ అందుతుంది. అదేవిధంగా ఒక్కో కోర్సును బోధించేందుకు ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్ల చొప్పున ఉమ్మడి జిల్లాకు 84మంది ఇన్‌స్ట్రక్టర్లను టీటీఎస్ సంస్థ ఇప్పటికే నియమించింది. అదేవిధంగా ఇప్పటికే ప్రభుత్వ ఐటీఐల్లో ఉన్న ఇతర ఇన్‌స్ట్రక్టర్లను కూడా ఈ కోర్సులను బోధించేందుకు వీలుగా తగు శిక్షణను కూడా టీటీఎల్ సంస్థ ఇప్పటికే అందించినట్లు తెలుస్తోంది. ఈ ఇన్‌స్ట్రక్టర్లతోపాటు ప్రతీ ఏటీసీలో మరో నలుగురు సిబ్బందిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. ఏటీసీల నిర్వహణ మొత్తం టీటీఎల్ సంస్థనే పర్యవేక్షిస్తుందని, కోర్సులు మొదలయ్యాక ఇంకా మార్పులు, చేర్పులుంటాయని పేర్కొంటున్నారు.



చదువు కొనాల్సిందేనా?

- నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లు
- వివిధ పేర్లతో డబ్బులు వసూలు
- యూనిఫాం, పుస్తకాల పేరుతో భారీగా వ్యయం
- పట్టించుకోని అధికారులు



చిన్నారుల చదువుల ఖర్చు మధ్యతరగతి తల్లిదండ్రులకు భారంగా మారింది. ఉన్నతంగా చదవాలని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తుండటంతో యాజమాన్యాలు యూనిఫాం, బెల్ట్, ఐడీ కార్డులు, పుస్తకాల పేరుతో జేబులు గుల్లచేస్తున్నారు. టెక్నో, ఐఐటీ, జేఈఈ పేర్లతో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. వెరసి చదువుల భారం తల్లిదండ్రులకు గుదిబండగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో భయం జొరబడుతోంది. ప్రైవేట్ పాఠశాలల్లో మౌళిక వసతులు లేకున్నా అనుమతులు ఇస్తున్న అధికారులు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా మిన్నకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసింది. అధిక సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. ఆయా విద్యాసంస్థల్లో సీట్లు ఖాళీగా ఉండటంలేదు. ప్రతీ నియోజకవర్గంలో మైనార్టీ, బీసీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు మైనార్టీ, కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుచేశారు. కొన్ని ఐదు నుంచి 10వ తరగతి వరకు ఉంటే మరికొన్ని 5-8వ తరగతి వరకు మరికొన్ని ఇంటర్ వరకు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో విద్యార్థి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. భోజనం, వసతి సౌకర్యం పొందవచ్చు. అయితే పరీక్ష ద్వారా ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. అందులో సీటు రాని వారు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతున్నా అందులో చదవటానికి విద్యార్థులకు, చదివించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు.

జిల్లాలో రూ.200 కోట్లపైనే

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుల భారం రూ.200 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసినా తల్లిదండ్రులు ప్రైవేట్ బాట పడుతూనే ఉన్నారు. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థల చెప్పినట్లుగా నడుచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణాల్లో మధ్య తరగతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూలీనాలి చేసుకునే వారు సైతం తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించేందుకు కుతూహలం చూపిస్తున్నారు. ఎన్ని వ్యయప్రయాసలకైనా ఓర్చి పిల్లలకు మంచి భవిష్యత్ కల్పించాలని భావిస్తున్నారు. దీనిని ప్రైవేటు పాఠశాలల యాజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యవసాయ కూలీలు పిల్లల చదువులకు, ఇటు వ్యవసాయానికి ఒకేసారి పెట్టుబడులు పెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు భారం రూ.15 వేలకు పైగానే..

ఒక్కో విద్యార్థిపై సుమారు రూ.15 వేలకు పైగా అదనపు భారం పడుతోంది. యూనిఫాం కోసం రూ.2వేలు, పెన్నులు, స్టేషనరీ ఖర్చుల కోసం రూ.1000, పుస్తకాల కోసం రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పైగా, మొత్తంగా రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు ఉంటే ఈ ఖర్చు రెట్టింపు. పాఠశాల స్థాయిని బట్టి ఈ ఖర్చులు పెరుగుతున్నాయి. వీటికి తోడు హైస్కూల్ స్థాయి వరకు సుమారు రూ.40 వేల వరకు ఉంటున్నాయి. కొన్ని పాఠశాలలు 6వ తరగతి నుంచి మెడిసిన్, ఐఐటీ ఫౌండేషన్ అంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ముందస్తు కోచింగ్‌ల పేరుతోనూ అదనంగా వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు అదనం. ఇంత చేస్తున్నా పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు రాజీపడుతున్నారు.



సూర్యాపేటలో బుక్‌స్టాల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

అధిక ఫీజులతో ఇబ్బంది పడుతున్నాం

పాఠశాలలో పుస్తకాలు, సామాగ్రి, ఫీజుల పేరుతో అడ్డూఅదుపు లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణ కమిటీ ఏమైందో తెలియదు. ఒక విద్యార్థిని చదివించాలంటే ఎంతో ఖర్చు అవుతోంది. అప్పుచేయాల్సిన పరిస్థితి తలెత్తింది. భార్యాభర్తలం ఉద్యోగాలు చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితిలో చదువుల భారం మరింత ఇబ్బంది పెడుతోంది.

- భాగ్యమ్మ, పట్టణవాసి



అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. అనవసరమైన డబ్బులు వసూలు చేయరాదు. పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయించవద్దు.

- అశోక్, డీఈవో

యువతకు ఉపాధిని మెరుగుపరుస్తాం

- మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో అధునాతన సాంకేతిక కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, జూన్ 19: యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరిగుట్టు వద్ద రూ.40కోట్లతో నిర్మిస్తున్న అధునాతన సాంకేతిక కేంద్రం (ఏటీసీ) భవన నిర్మాణానికి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ పరిధిలో రాష్ట్రంలో 65 ప్రభుత్వ ఏటీసీ, 225 ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులకు ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ 32 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆయా పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో 76,900 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏటీసీ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు అప్రెంటీస్ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రతీ రెండో సోమవారం వివిధ ప్రభుత్వ ఏటీసీల్లో అప్రెంటీస్ మేళాలను నిర్వహిస్తామన్నారు. మేళాలకు పరిశ్రమల నిర్వాహకులను ఆహ్వానించి విద్యార్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూలు చేపడతామన్నారు. శిక్షణ సమయంలో రూ.8వేల నుంచి రూ.11,500 వరకు స్టైఫండ్ ఇస్తామని, ఏటీసీ శిక్షణ తీసుకుంటున్న సమయంలోనే వృత్తి నైపుణ్యం పెరిగేందుకు విద్యార్థులను పరిశ్రమలకు పంపించి మూడు నెలల్లో శిక్షణ పూర్తి చేయిస్తామన్నారు. హుజూర్‌నగర్‌లోని అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)లో 216 సీట్లు ఉన్నాయన్నారు. పట్టణంలోని ఐదు ఎకరాల్లో ఏటీసీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. టాటా కంపెనీ సహకారంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ హయాంలో యువతకు అన్యాయం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 30వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. త్వరలో మరిన్ని పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కోతి సంతప్‌రెడ్డి, యరగాని నాగన్నగౌడ్, డిప్యూటీ డైరెక్టర్ రాజారావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది

మేళ్లచెర్వు : చింతలపాలెం ప్రాంత సాగునీటి అవసరాల కోసం కృష్ణానదీపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20 కోట్లతో రామాపురం ఎక్స్ రోడ్డు నుంచి దొండపాడు వరకు 20 కిలోమీటర్ల డబుల్ రోడ్డు పనులను ప్రారంభించి, మాట్లాడారు. కృష్ణానదీపై ఉన్న ఎత్తిపోతల పథకాలు అన్ని మరమ్మతులు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా నిర్వహిస్తామని, రూ.386 కోట్లతో 8,850 ఎకరాల సాగు లక్ష్యంతో దొండపాడు వద్ద రెండు ఎత్తిపోతల పథకాలను నూతనంగా ప్రారంభించి రామాపురంలోని గోపాలరావు చెరువులో కలుపుతామన్నారు. వీటి ద్వారా కందిబండ, గణపవరం, రేవూరు, రామాపురం, దొండపాడు గ్రామాలకు సాగు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నర్సింహారావు, లక్ష్మారెడ్డి, ఎన్ఎస్‌పీ ఈఈ లక్ష్మారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ భాస్కర్‌రావు, ఏఈ రమేష్, శివకుమార్, స్వామి, శ్రీనివాస్, ఎంపీపీ పద్మ, జడ్పీటీసీ పద్మ, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, వైస్‌ఎంపీపీ గోపిరెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

నేరేడుచర్ల: హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి నుంచి సోమారం వరకు రూ.20 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు నేరేడుచర్ల మండలంలో ఆరునెలల్లో రూ.70 కోట్లతో రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించానన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి, జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీపీ జ్యోతి, చిల్లేపల్లి మాజీ సర్పంచ్ మనోజ్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలి

చిలుకూరు: రహదారులను సకాలంలో, నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలో బుధవారం రాత్రి చిలుకూరు నుంచి జెర్రిపోతులగూడెం వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ ప్రశాంతి కోటయ్య, జడ్పీటీసీ శిరీషానాగేంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సికిల్ సెల్‌ను కలిసికట్టుగా ఎదుర్కొందాం



సికిల్‌సెల్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కోటా చలం

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 19 : జిల్లాలో సికిల్ సెల్ రక్తహీనతను కలిసి కట్టుగా ఎదుర్కొందామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కోటా చలం అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గిరిజన అభివృద్ధి శాఖతో కలిసి నిర్వహించిన ప్రపంచ సికిల్ సెల్ రక్తహీనత నివారణ మిషన్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధికి రాష్ట్రంలో 14 జిల్లాలోని ఆదివాసీలు, గిరిజన ప్రజలు గురయ్యారని తెలిపారు. వారికి అవగాహన కల్పించి సరైన చర్యలు చేపట్టాలన్నారు. నేటి నుంచి జూలై 3వ తేదీ వరకు అన్ని పల్లె దవాఖానాలో, సామజిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో, విద్యార్థి వసతిగృహాల్లో, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీ చంద్రశేఖర్, డాక్టర్ పీ వెంకటరమణ, కొమ్ము శంకర్, పద్మావతి, అంజయ్యగౌడ్, కే పార్థసారధి, వసతి గృహ సంక్షేమఅధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

- నడిగూడెంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

6

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

హామీలు నెరవేర్చకపోతే ప్రజాగ్రహం



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి, నాయకులు

పెన్‌పహాడ్, జూన్ 19 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే సీపీఎం పోరాటాలతో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసత్య ఫంక్షన్‌హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలతో బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చేది కమ్యూనిజమేనని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై పాలకులతో పోరాడేది సీపీఎం అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారన్నారు. అర్హత కలిగిన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పించన్లు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి 'భారత సమాజ పరిణామక్రమం' అనే సబ్జెక్టుపై ప్రసంగించారు. అంతకుముందు సీపీఎం సీనియర్ నాయకుడు గుంజా వెంకటేశ్వర్లు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, పాలపెల్లి శేఖర్‌రావు, మేదరమట్ల వెంకటేశ్వర్‌రావు, మట్టిపెల్లి సైదులు, చెరుకు యాకలక్ష్మి, కోట గోపి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన రవి, రణపంగి కృష్ణ, చిన్నపంగి నర్సయ్య, మడ్డి అంజిబాబు, ధనియాకుల శ్రీను పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,03,371 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని నటి అనసూయ భరద్వాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.



ప్రధానాలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

దామరచర్ల, జూన్ 19: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మండలకేంద్రంలో బుధవారం జరిగింది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి... తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన మద్దూరి కృష్ణ(52) కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి తిరుపతి నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న పూర్ణ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకో పైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వేఎస్ఐ తెలిపారు. కేసును రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత దర్యాప్తు చేపట్టారు. కృష్ణకు భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



కృష్ణ (ఫైల్)

నాపరాయి తరలిస్తున్న లారీ పట్టివేత

ప్రభుత్వ అనుమతులు లేకుండా నాపరాయిని తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన సంఘటన ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల గ్రామం నుంచి నాపరాయిని లారీలో లోడ్ చేసుకొని ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్లకు అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద లారీని పట్టుకున్నారు. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారన్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ బత్తుల అమరలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే

త్రిపురారం: ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నల్లగొండ జడ్పీ డిప్యూటీ సీఈవో బీ. శ్రీనివాస్ రావు తెలిపారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్‌తో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో కోడిరెక్క రాజేందర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మిర్యాలగూడలో జరిగిన సమావేశంలో 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, జూన్ 19: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి వెంకటేశ్వర్లు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం జరిగిన డివిజన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా కార్మికుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ సాధన దిశగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మార్చి 10న యూనియన్ రాష్ట్ర నాయకత్వం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను వివరించి పరిష్కారించాలని కోరినట్లు తెలిపారు. 50డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం యూనియన్ డివిజన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ. షఫీఖాన్, కార్యనిర్వహక అధ్యక్షుడిగా ఎస్‌కె. అహ్మద్, డివిజన్ కార్యదర్శి గోలి నరేందర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా మోతీలాల్ నాయక్ ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి. సాయిబాబా, డిస్కం అధ్యక్షుడు వేణు, కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్. వెంకన్న, రాష్ట్ర సలహాదారు ఎన్. జనార్ధన్‌రెడ్డి, జి. శ్రీనివాస్, వెంకటయ్య, డివిజన్ నాయకులు సి.సాలమన్, కర్ర రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

నల్లగొండ టౌన్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెనుకాడేది లేదని 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూనియన్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు నిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. న్యాయపరమైన ఇబ్బందుల పేరుతో విద్యుత్ రంగంలో ఉద్యోగులు మూడు సంవత్సరాలుగా పదోన్నతులకు నోచుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ సంఘం కృషి ఫలితంగా విడుదల చేయనున్నారని తెలిపారు. ఉద్యోగులకు బదిలీలు ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. సీనియర్ ఫోర్‌మెన్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 52సమస్యలపై ఇప్పటికే యాజమాన్యానికి నోటీసు అందజేసి పీఎస్‌సీ సమావేశం అడిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా రీజినల్ అధ్యక్షుడు నిమ్మచెట్ల వెంకటయ్య, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఏ. వేణు, వర్కింగ్ అధ్యక్షుడు ఎన్. వెంకన్న, యూనియన్ రాష్ట్ర సలహాదారుడు ఆర్‌జ నార్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పి. రాంబాబు, డి కోటి, సిహెచ్ యాదగిరి, కె. జగదీష్, శీనయ్య, పీవీ. నాయక్, ముత్తయ్య ఉన్నారు.

'నీట్' పరీక్ష రద్దు చేయాలి



మిర్యాలగూడలో సంతకాలు సేకరిస్తున్న ఎస్‌ఎస్‌యూఐ నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 19: నీట్ పరీక్షను రద్దు చేసి, వేలాది మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఆరీఫ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యవిద్యలో ప్రవేశాలకు నిర్వహించే ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని, సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు చందాల ప్రశాంత్‌కుమార్, సంజీవ్, సతీష్, రాము, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

హాలియా, జూన్, 19: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా హాలియాలోని సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై, అనుమతి లేని పాఠశాలలపై, సీబీఎస్ సిలబస్ పేరుతో తల్లితండ్రులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 19: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కొండేటి సురేష్, రూత్ దంపతుల కూతురు(16) కన్పించడం లేదని బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పుట్టుకతో చెవుడు సమస్యతో బాధపడుతున్న బాలిక అవంతీపురంలోని బధిరుల పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. ఈ నెల 18వ తేదీన పట్టణంలోని రాంనగర్ సరస్వతీ స్కూల్ వెనుక భాగంలో ఉన్న తమ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్: 7075050756, 8341853108 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునుగోడు, జూన్ 19: నల్లగొండ జిల్లా మునుగోడు శివారు మీదుగా రెండు గూడ్స్ ఆటోల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీశైలం, రూప్‌సింగ్ వేర్వేరుగా ఆటోల్లో వివిధ సంచుల్లో నింపుకొని తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి, జూన్19: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పడమటితండాలోని సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దేవరకొండ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మల్లేషంతో కలిసి ధ్వంసం చేశారు. సారా బట్టీలు నిర్వహించినా, నల్లబెల్లం, పటిక నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మొదటిసారి పట్టుబడితే బైండోవర్, రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. దాడుల్లో వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, సైదులు, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గదిలోనే శునకం.. తాళం వేసిన కళాశాల సిబ్బంది

దేవరకొండ, జూన్19: తరగతిలోకి వెళ్లిన శునకాన్ని గమనించకుండా సిబ్బంది తాళం వేసి వెళ్లిపోయారు. బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో కిటికిల వద్దకు వచ్చి మొరుగుతూ గంట సేపు యాతన పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో బుధవారం జరిగింది. సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత సిబ్బంది తరగతి గదులకు తాళాలు వేసే క్రమంలో కళాశాల గదిలోకి ఓ శునకం చేరింది. దానిని గమనించని సిబ్బంది కళాశాల గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో శునకం కిటికిల వద్దకు వచ్చి మొరిగింది. కళాశాల ఆవరణలో సాయంత్రం వాకింగ్ చేస్తున్న డివిజన్ పంచాయతీ అధికారి రాంమోహన్‌కు శునకం అరుపులు వినిపించాయి. ఆయన వెంటనే అక్కడికి వెళ్లి తాగునీరు, ఆహారం అందించారు. స్థానిక ఎంఈవోకు, కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే వచ్చి కళాశాల గది తెరవడంతో శునకం బయటకు వచ్చి పారిపోయింది.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు

ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు

నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు

సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు

రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.

తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు

సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు

ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి

శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం

ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు

వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

మూడు నెలల ముందుగానే

వర్చువల్ క్యూ బుకింగ్

● శబరిమల దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త

నార్కట్‌పల్లి, జూన్ 19: మండల పూజ, మకర విళక్కు సమయాల్లో శబరిమలను దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త చెప్పింది. శబరిమలకు వెళ్లే భక్తులకు కనీస వసతులు, భద్రత కోరుతూ ప్రచారసమితి తరఫున గతేడాది కేరళ సీఎం పినరై విజయన్‌కు తాము చేసిన వినతికి ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు సానుకూలంగా స్పందించిందని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే తెలిపారు. గతంలో స్వామి దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కేవలం పదిరోజుల ముందునుంచి మాత్రమే ఉండేదని, ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని తెలిపారు. అదేవిధంగా భక్తుల ఆరోగ్యభద్రత కోసం ఇన్సూరెన్స్ పాలసీని అందించనున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. భక్తులు దర్శనం టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలోనే వారి వద్ద నుంచి అదనంగా రూ.10లు వసూలు చేసి బీమా పాలసీని వర్తింపజేస్తారని దేశ్‌పాండే తెలిపారు. చిన్నారుల కోసం ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటుచేసి అయ్యప్ప దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం అప్పం, అరవణ ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ప్రకటనల ఆవరణలో సెన్సార్ కౌంటింగ్ పరికరాన్ని ఏర్పాటు చేసి భక్తుల సంఖ్యను లెక్కించనున్నారని దేశ్‌పాండే తెలిపారు.

ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంఎస్‌రెడ్డి



ఎంఎస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

నాగార్జునసాగర్, జూన్ 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత సిబ్బంది ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమాండెంట్ సామోల్ జాన్ బదిలీపై హైదరాబాద్ ఆర్బీఐకి వెళ్లారు. నూతనంగా వచ్చిన ఎంఎస్‌రెడ్డికి సిబ్బంది స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన సామోల్ జాన్‌కు వీడ్కోలు పలికారు. ఎస్పీఎఫ్ ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, పుల్లయ్య, డీడీ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సరదా అంచున ప్రమాదం



భువనగిరి పెద్ద చెరువు కట్టపై ఇరువైపులా ఆహ్లాదకరమైన చెట్లు, లవ్ భువనగిరి, భారీ ఎత్తున జాతీయ జెండా ఏర్పాటు చేయడంతో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. చెరువులోని ఎఫ్‌టీఎల్ మార్కింగ్‌పై ఇరువైపులా రక్షణ గోడ లేదు. అక్కడ సెల్ఫీలు దిగడానికి యువతి, యువకులు ఆసక్తి చూపుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో చెరువులో పడిపోయే ప్రమాదముంది. ● స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రిభువనగిరి

దేశ భవిష్యత్‌కు దిక్సూచి రాహుల్‌గాంధీ

● ఎమ్మెల్యే మందుల సామేలు ● జిల్లాలో ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు ● కేకులు కట్ చేసి సంబురాలు

తిరుమలగిరి, జూన్ 19: దేశ భవిష్యత్‌కు దిక్సూచి రాహుల్‌గాంధీ అని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సామేలు ముఖ్య అతిథి హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి మండల అధ్యక్షుడు వై.నరేష్, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, వైస్ చైర్మన్ కేశిడి సరళ, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, సుంకరి జనార్దన్, జుమ్మీలాల్, కౌన్సిలర్లు గిలకత్తుల ప్రియలత, కుదురుపాలక శ్రీలత, పేరాల వీరేష్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, కందుకూరి లక్ష్మయ్య, రాపాక సోమేష్ పాల్గొన్నారు.



కోదాడలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట టౌన్: సుస్థిర ప్రభుత్వం, సమర్థపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాల అమలుతో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందన్నారు. 'జోడో యాత్ర'తో రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళ్లి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారన్నారు. గతంలో ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి, నేటివరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, అబ్దుల్ రహీం, ఆయూబ్‌ఖాన్, గండూరి రమేష్, అభినయ్, కక్కిరేణి శ్రీనివాస్, ఆలేటి మాణిక్యం, నరేందర్‌నాయుడు, వాసు, అన్నమయ్య, రాము పాల్గొన్నారు.



సూర్యాపేటలో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

కోదాడ టౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను కోదాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్నేని బాబు, మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గంధం యాదగిరి, షాబుద్దీన్, చందు నాగేశ్వరరావు, శ్రీను, నెమ్మాది దేవమణి, బాగ్దాన్, బాజన్, ఫయాజ్, ముస్తాఫా, దాదావలి, షఫి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గునుకుల గోపాల్‌రెడ్డి, మండల గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరెడ్డి, ఈదుల కృష్ణయ్య, జొన్నలగడ్డ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, పెండెం రాంమూర్తి, ఓరుగంటి సత్యనారాయణ, కొండా రాజు, కటకం వెంకటేశ్వర్లు, సూరయ్య, కృష్ణయ్య, జలంధర్, ముత్తిలింగం పాల్గొన్నారు.



తిరుమలగిరిలో రాహుల్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు

అర్వపల్లి: మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం, వేల్పుల రమేష్, నసీర్‌గౌడ్, బైరబోయిన మహారాజు, మనోహర్, ప్రసాద్, శ్రీకాంత్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతనకల్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాధీ పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, చురికంటి చంద్రారెడ్డి, మేడిపల్లి అశోక్, సాబాది వాసు, బద్దం వెంకట్‌రెడ్డి, శీలం మధు పాల్గొన్నారు.

మద్దిరాల: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూజ ఎల్లేష్, శ్యాంరెడ్డి, కోడి కుమార్‌యాదవ్, ఉపేందర్ పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి సారూ..



నర్సిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్మికులు

పెన్‌పహాడ్, జూన్ 19: తమకు తొమ్మిది నెలలుగా రావాల్సిన వేతనాలు ఇప్పించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ కోరారు. బుధవారం పెన్‌పహాడ్ మండల కేంద్రానికి వచ్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డికి కార్మికులతో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మంత్రి సీతక్కతో మాట్లాడి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నకిరేకంటి నర్సయ్య, గన్నె నాగరాజు, ఎల్లమ్మ, సూర్య, శ్రవణ్, విజయ్, లక్ష్మయ్య, వీరస్వామి ఉన్నారు.

మండలంలో సమస్యలను పరిష్కరిస్తా



నడిగూడెం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం, కోదాడ, మునగాల రూరల్, జూన్ 19: మండలంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఎన్.పద్మావతి అన్నారు. ఎంపీపీ యాతాకుల జ్యోతిమధుబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన నడిగూడెం మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నడిగూడెం నుంచి రత్నవరం, కాగితరామచంద్రపురం గ్రామం వరకు డబుల్ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. మండలంలో మౌలిక వసతులు కల్పిస్తా నని, సమస్యను ప్రాధాన్యం క్రమంలో పరిష్కరిస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలపాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక మాట్లాడుతూ మంత్రి, ఎమ్మెల్యే సహకారంతో మండలంలోని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. మండలంలో సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, జడ్పీటీసీ బానాల కవితనాగరాజు, ఎంపీడీవో ఇమాం, తహసీల్దార్ హేమమాలిని, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నడిగూడెం మండలంలోని 23మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పద్మావతి, జడ్పీ చైర్‌పర్సన్ దీపిక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరెడ్డి, గుండు శ్రీను, సుధీర్, నర్సిరెడ్డి, శెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్కుల పంపిణీ ఆలస్యమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థికసాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎర్నేని బాబు, ఎంపీపీ మల్లెల రాణి, చుండూరు వెంకటేశ్వరరావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మండల అధికారుల సమన్వయంతో పనిచేసి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే పద్మావతి ఆదేశించారు. మునగాల ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన నిర్వహించిన మునగాల మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దేశిరెడ్డి జ్యోతి, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ అంజనేయులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు. మునగాలలో 14మంది లబ్ధిదారులకు రూ. 15లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నేషనల్ అకాడమి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి

గరిడేపల్లి, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ అమలుచేసే ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులకే వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.వనజకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రజాపాలన నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిందన్నారు. ఈ దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయనందున అర్హులకు న్యాయం జరగలేదన్నారు. అధికారులు చేసిన తప్పులకు ప్రజలను బలిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ చేయించి అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఆరు గ్యాంటీలను ప్రభుత్వం ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా ఉచిత విద్యుత్ కోసం పలువురు కార్యాలయాల చుట్టూ తిరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లోకి అధికారులను పంపి దరఖాస్తులను స్వీకరించి అర్హులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పోకల వెంకటేశ్వర్లు, నాయకులు

కార్యక్రమంలో నాయకులు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండ్ల సత్యనారాయణరెడ్డి, యోహాన్, రమేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న వినియోగదారుల వేదిక చైర్మన్ నాగేశ్వరరావు

కోదాడ, జూన్ 19: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కోదాడలోని సబ్‌స్టేషన్లో నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార సమావేశంలో ఆయనమాట్లాడారు. వినియోగదారుల నుంచి అధికంగా వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ ప్రమాదాల్లో మృతిచెందిన బాధితుల పరిహార చెల్లింపు సమస్యలు ఉన్నాయన్నారు.పెండింగ్ బిల్లుల సమస్యలు, మీటర్లు మార్పు వంటి సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు.వినియోగదారులు సమస్యల పరిష్కారానికి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. తమ దృష్టికి వచ్చిన 41 సమస్యలను 40రోజుల్లో పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. వినియోగదారులు సమస్యలు ఏమైనా ఉంటే సీజీఆర్‌ఎఫ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సమస్యలను కన్జూమర్ గ్రీవెన్స్ సెల్ పరిష్కరిస్తుందన్నారు. ముందుగా వినియోగదారులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వేదిక మెంబర్లు వెంకట్, శోభారాణి, ఏడీ వెంకన్న, ఏఈ మల్లెల శ్రీనివాస్, డీఈ వెంకటకృష్ణయ్య, వినోద్, కీర్తిరెడ్డి, లైన్‌మన్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'బాదె రాము ఆశయాలను సాధించాలి'

గరిడేపల్లి, నడిగూడెం, జూన్ 19: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు బాదె రాము ఆశయాలను సాధించాలని మండలంలోని వెలిదండ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. బుధవారం వెలిదండ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రాము ఐదో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాము చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. రాము చిన్న వయసులోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితులయ్యారని, విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చేరి విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదుగుతూ సీపీఐ(ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యుడిగా విధులు నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారన్నారు .రాము ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, గండు నాగేశ్వరరావు, మాశెట్టి అంజయ్య, సూర్యం, సాంబయ్య, లక్ష్మయ్య, లచ్చయ్య, సంతోష, సువార్త, మల్లమ్మ, నర్సమ్మ, రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● కార్మికుల సంక్షేమానికి ఇఫ్టూ జిల్లా నాయకుడు బాదె రాము కృషి చేశారని అరుణోదయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, కోట్ల లక్ష్మయ్య అన్నారు. నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రపురంలో బుధవారం రాము ఐదో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు నవీన్, నర్సింహ, కనకరాజు, నగేష్, శ్రీను, నాగమణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోదాడ రూరల్, జూన్ 19: మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన కటీరుదాసు వైద్యానికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి బుధవారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. సోషల్ మీడియాలో వచ్చిన విన్నపాలను చూసి ఆర్థికసాయం అందించినట్లు వెంకటాచారి తెలిపారు.

'కల్యాణలక్ష్మి' పథకం పేదలకు వరం

తిరుమలగిరి, జూన్ 19: కల్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, వైస్ చైర్మన్ కేశిడి సరళ, తహసీల్దార్ సుధ, ఎంపీడీవో లాజర్, ఆర్ఐ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మఠంపల్లి,జూన్ 19: నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల ఏవో బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు బిల్లులను తీసుకోవాలన్నారు. పత్తి, వరి, కంది, పెసర విత్తనాలను పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేయవద్దన్నారు. స్థానిక దుకాణాల్లో ఉన్న విత్తనాలను పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపామన్నారు. లైసెన్సు కల్గిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో ఏఈవోలు భవన్, శ్రావ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూన్ 19: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

రూ.4లక్షల విలువైన తంబాకు పట్టివేత

కోదాడ రూరల్, జూన్ 19: మండలంలోని నల్లబండగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రూ.4లక్షల విలువైన తంబాకు పోలీసులు పట్టుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం విశాఖపట్నం నుంచి నల్లగొండ వెళుతున్న ఓ కంటైనర్‌లో రూ.4లక్షల విలువైన తంబాకును బుధవారం తెల్లవారుజామున పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఈ తంబాకును 24 అట్టపెట్టల్లో పార్సిల్ చేసి కంటైనర్‌లో నల్లగొండకు తరలిస్తుండగా మండల పరిధిలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించగా, పొగాకు ఉత్పత్తులకు ఉపయోగించే తంబాకు లభ్యమైందన్నారు. కంటైనర్ డ్రైవర్ రాంలాల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ తంబాకుపై ప్రభుత్వ నిషేధం ఉందా? లేదా? అనే విషయం తెలుసుకునేందుకు ఆహార భద్రతా అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వారి పరిశీలన అనంతరం తంబాకు సరఫరా చేస్తున్న నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. అప్పటివరకు కంటైనర్‌ను సీజ్ చేస్తామన్నారు. ఆహార భద్రతా అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మురళి ఫైల్ ఫొటో

నూతన్‌కల్, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన గుండా మురళి(55)గత నెలలో రోజుటి మాదిరిగా సూర్యాపేటలో మోపెడ్‌పై పనికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో మురళి తలకు బలమైన గాయాలు కాగా, అతడిని సూర్యాపేట ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. మురళి ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు రానందున రెండు రోజులు క్రితం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మురళికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నిరుపేద అయిన మురళి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తోటలోని గదిలో చోరీ

తిరుమలగిరి రూరల్, జూన్ 19: తోటలోని గదిలో దొంగలు చోరీ చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొండ గ్రామానికి చెందిన గొడుగు యాకస్వామి అదే గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు నిమ్మ తోటను కౌలుకు తీసుకున్నారు. అదే తోటలో ఉన్న గదిలో నివసిస్తున్నాడు. మంగళవారం గదికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గది తాళం ధ్వంసం చేసిన దొంగలు లోపలికి వెళ్లి రెండు తులాల బంగారు, సామ్‌సంగ్ సెల్ ఫోన్, టీవీ ఎత్తుకెళ్లారు. వేలి ముద్రలను క్లూస్ టీం సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో తొమ్మిది గేదెలు మృతి

హుజూర్‌నగర్, గరిడేపల్లి, జూన్ 19: హుజూర్‌నగర్ పట్టణంలో , గరిడేపల్లి మండలంలో విద్యుదాఘతంలో బుధవారం తొమ్మిది గేదెలు మృతి చెందాయి. మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసినందున హుజూర్‌నగర్‌లో దొంతిరెడ్డి సుధాకర్‌రెడ్డి పొలం వద్ద విద్యుత్ స్తంభాలు కూలాయి. బుధవారం మేతకు వెళ్లిన ఎనిమిది గేదెలు విద్యుత్ సరఫరా జరిగే తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. హుజూర్‌నగర్‌కు చెందిన నర్సింహారావుకు చెందిన నాలుగు గేదెలు, చాగంటి వెంకన్నకు చెందిన రెండు గేదెలు, ఉప్పతల శ్రీనివాస్‌కు చెందిన రెండు గేదెలు మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.6లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరారు.

● గరిడేపల్లి మండలంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన మల్లెంపల్లి వరలక్ష్మి తన గేదెను మేత కోసం రోజుటి మాదిరిగా పొలాల్లోకి బుధవారం వదిలింది. గ్రామ శివారులో గేదె మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80వేల విలువైన గేదె మృతి చెందిందని, ప్రభుత్వం తనను ఆదరుకోవాలని మహిళా రైతు వరలక్ష్మి కోరింది.

మఠంపల్లిలో వ్యాపారి అదృశ్యం



చంద్రశేఖర్

మఠంపల్లి, జూన్ 19: మండల కేంద్రంలో వ్యాపారి అదృశ్యమ య్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెచ్చ చంద్రశేఖర్ కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో లేఖ రాసి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. అప్పుల ఎక్కువయ్యాని మనస్తాపం చెంది వెళ్లి పోతున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. సాయంత్రం సమయంలో శేఖర్ భార్య మధుపావని లెటర్‌ను గుర్తించి స్నేహితులను, బంధువులకు వాకబు చేసినా భర్త ఆచూకీ తెలియరాలేదు. రెండేళ్ల క్రితం చంద్రశేఖర్ ఇదేవిధంగా ఇంటి వెళ్లిపోగా, రూ.50లక్షల అప్పులను తండ్రి తీర్చినట్లు సమాచారం. భర్త కనబడటంలేదని మధుపావని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకి తెలిసినవారు సెల్ నెం.8186907693, 9014141159కు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

బోరును స్వాధీనంచేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి

నూతన్‌కల్, జూన్ 19: మండలంలోని తాళ్లసింగారం గ్రామంలో గ్రామ పంచాయతీ తాగు నీటి బోరును స్వాధీనం చేసుకున్నవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళలు కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి మంచినీటిని అందించే బోరును గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిత్తలూరి నారాయణ 30ఏళ్ల క్రితం ఇచ్చాడన్నారు. ఈ బోరును నారాయణ వారం రోజుల క్రితం తిరిగి స్వాధీనం చేసుకున్నాడన్నారు. అప్పటినుంచి తమ బజారుకు నీరు రావడంలేదని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ బోరును వెంటనే స్వాధీనం చేసుకుని నీటి సరఫరాను పునరుద్ధరించాలని కార్యదర్శి సుధాకర్‌ను ఆదేశించారు.

రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించాలి

పాలకవీడు, జూన్ 19: కరోనా సమయంతో ప్రాణాలను పణంగా పెట్టి వైద్యసేవలు అందించిన రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయనాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యంతో పాటు, ఉచిత వైద్యం అందించాలని ఆయన కోరారు.

మండల వ్యవసాయాధికారిగా మల్లారెడ్డి

అర్వపల్లి, జూన్ 19: మండల వ్యవసాయాధికారిగా మల్లారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లారెడ్డి జిల్లా కేంద్రంలోని ఏడీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఏవో శశిధర్‌రెడ్డిని హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

విద్యుత్ కొనుగోలుపై కమిషన్ ఏర్పాటు చేయాలి

సూర్యాపేట అర్బన్, జూన్ 19: విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాల్లో జరిగిన అవినీతిపై కమిషన్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ చేయించాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కుంట్ల ధర్మార్జున్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పినా నాయకుల్లో మార్పురాలేదన్నారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

సూర్యాపేట అర్బన్, జూన్ 19: గృహ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం తేవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హుస్సేన్ అన్నారు. గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ కార్మికులకు కనీస వేతనం రూ.12వేలు అమలుచేయాలని సూచించారు. గృహ కార్మికులు రాష్ట్రంలో 11లక్షల మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో పాల్వాయి సుహాసిని, పద్మ, రేణుక, శారద, నాగమ్మ, వరలక్ష్మి నిర్మల, మల్లిక, నర్సమ్మ పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు

మఠంపల్లి, జూన్ 19: అధిక ఫీజు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై కఠినచర్యలు తీసుకుంటామని ఎంఈవో పానుగోతు చత్రునాయక్ హెచ్చరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను బుధవారం మండలంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.